7

సాక్షి

అనకాపల్లి

గురువారం : 9 : జనవరి : 2025



ప్రధాని పర్యటన నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని నిరసన తెలుపుతున్న వామపక్ష కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కిందపడేసి తొక్కేశారు. లాక్కెళ్లి జీపుల్లో పడేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు.

పర భజన.. స్వ భజన

పరస్పర భజన

ప్రధాని మోదీ సభలో ఆద్యంతం ఇదే తంతు



ప్రధాని మోదీకి గవర్నర్ నజీర్ స్వాగతం

- స్టీల్‌ప్లాంట్‌పై భరోసా దక్కలేదు.. మెట్రో ఊసెత్తలేదు..
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ ప్రస్తావన లేదు
- చంద్రబాబు, పవన్ నోట వినిపించని 'ఉక్కు' మాట
- నిరసన తెలిపిన వారిని అరెస్టులు చేయించిన ప్రభుత్వం

విశాఖ సిటీ : ప్రధానమంత్రి మోదీ సభతో కూటమి ప్రభుత్వ బండారం బట్టబయలైంది. స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ఉన్న చిత్తశుద్ధేమిటో తేటతెల్లమైంది. గంటన్నర పాటు సాగిన ప్రసంగాల్లో ఎవరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట రాలేదు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా రాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు ఊసెత్తలేదు. భోగాపురం విమానాశ్రయానికి కనెక్టివిటీ ప్రస్తావన లేదు. సభలో ఆద్యంతం పర భజన, స్వభజన, పరస్పర భజనే వినిపించింది. కేవలం ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తడానికే కూటమి ప్రభుత్వం బహిరంగ సభ ఏర్పాటు చేసిందన్న భావన ప్రతీ ఒక్కరిలోను కలిగింది.

మిట్టల్ స్టీలే ముద్దా..?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తని చంద్రబాబు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం తెగ ప్రేమను కురిపిస్తున్నారు. మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను ఎలా తొలగించాలన్న అంశంపై ప్రధాని మోదీతో మాట్లాడానని చంద్రబాబు సభలోనే చెప్పడం విశేషం. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా పైప్ లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఒక ప్రైవేటు స్టీల్‌ప్లాంట్ కోసం అంతలా తాపత్రయపడుతున్న చంద్రబాబు, పవన్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కనీసం నోరెత్తకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దేశంలో ఇతర ప్రాజెక్టులు, అంశాలను ప్రస్తావిస్తూ మోదీపై పొగడ్తల వర్షం కురిపించిన ఇరువురూ.. విశాఖకు సంబంధించి ఒక అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం గమనార్హం.

'ఉక్కు' నిరసనలు.. అరెస్టులు

స్టీల్‌ప్లాంట్ భవితవ్యంపై భరోసా ఇవ్వాలని వామపక్ష పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పట్టుబట్టారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానితో దీనిపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వీరిలో చాలా మందిని గృహ నిర్బంధం చేసింది. ఉక్కుపై లేచిన నోర్లను మూయించే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ కొంత మంది మద్దిలపాలెం, ఇతర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో వారిని అరెస్టులు చేయించింది.



పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం చప్పట్లు కొడుతున్న ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



సభకు హాజరైన జనం

'ఉక్కు'పై నోరుమెదపని సీఎం, డీసీఎం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు 1,427 రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నాయి. ప్రధాన మంత్రి విశాఖ పర్యటన సందర్భంలో అయినా ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా వస్తుందని అందరూ భావించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనంపై ప్రధానితో ఒక ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా బైక్ ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. పీఎం సభలో స్టీల్‌ప్లాంట్‌పై ఒక భరోసా వస్తుందని ఆశపడ్డారు. కానీ ఇవేవీ చంద్రబాబు, పవన్‌లకు వినిపించలేదు. బహిరంగ సభలో ఇద్దరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట వినిపించలేదు. ఉక్కు పరిశ్రమపై భరోసా ఇవ్వాలని కనీసం అడిగే ధైర్యం కూడా చేయలేదు.

విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేదు

ప్రధాని మోదీ సభలో విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేకుండా పోయింది. ప్రధానంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ను సైతం సిద్ధం చేసింది. దీనికి నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది. తాజాగా ప్రధాని మోదీ విశాఖ వచ్చిన సందర్భంలో మెట్రో ప్రాజెక్టుపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని అందరూ భావించారు. కానీ చంద్రబాబు గానీ, పవన్ కల్యాణ్ గానీ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా ప్రస్తావించలేదు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన జరిగి నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఈ ఎయిర్‌పోర్టుకు వేగవంతంగా చేరుకునేందుకు వీలుగా కనెక్టివిటీ రహదారుల అభివద్ధికి గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దానిపై కూడా చంద్రబాబు నోరెత్తలేదు. విశాఖకు సంబంధించి ఒక ప్రాజెక్టు ప్రస్తావన లేకుండానే సభను ముగించారు.

నగర ప్రథమ పౌరురాలికి అవమానం

నగర ప్రథమ పౌరురాలు మేయర్ హరి వెంకట కుమారికి ఘోర అవమానం జరిగింది. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు కనీసం కూటమి ప్రభుత్వం ఆహ్వానించలేదు. వాస్తవానికి ప్రముఖులు ఎవరు వచ్చినా ప్రథమ పౌరురాలిగా రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా గౌరవించాలి. ఇందుకు భిన్నంగా ప్రధాని నగరానికి వచ్చినప్పటికీ అధికారులు కనీస సమాచారం కానీ ఆహ్వానం కానీ ఇవ్వకపోవడం గమనార్హం. అయితే చివరికి వీడ్కోలు పలికే సమయానికి మాత్రం రావాలంటూ కబురు పంపినట్లు తెలుస్తోంది. బీసీ మహిళ పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు విమర్శల పాలవుతోంది.

ముగిసిన ప్రధాని పర్యటన

- **సాయంత్రం 4.30**కు రోడ్ షో
- **ఓపెన్ టాప్ జీప్‌లో** ప్రజలకు **అభివాదం చేసిన** ప్రధాని మోదీ
- **పూలతో స్వాగతం** పలికిన ప్రజలు
- **బహిరంగ సభలో** పలు ప్రాజెక్టులకు **వర్చువల్‌గా శంకుస్థాపన**



రోడ్డు షోలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ సిటీ : ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయ**వంతంగా ముగిసింది. భారీ** భద్రతా ఏర్పాట్ల మధ్య **రోడ్ షో, బహిరంగ సభ** ప్రశాంతంగా సాగింది. **ప్రధాని బుధవారం సాయం**త్రం 4.15కు ఇండియన్ **ఎయిర్‌ఫోర్స్ విమానంలో** విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు **చేరుకున్నారు. అక్కడ గవర్న**ర్ అబ్దుల్ నజీర్, ముఖ్య**మంత్రి చంద్రబాబు, డిప్యూ**టీ సీఎం పవన్ కల్యాణ్‌లు **ప్రధానికి స్వాగతం పలికా**రు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిరిపురం ప్రాంతంలోని వెంకటాద్రి వంటిల్లు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఓపెన్ టాప్ జీప్ ఎక్కారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న జనాలకు అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రజలు కూడా పూలతో మోదీకి స్వాగతం పలికారు. సాయంత్రం 5.30కు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

జీప్‌లో లోకేష్‌కు దక్కని చోటు

ప్రధాని సభ సందర్భంగా నగరమంతా హోర్డింగ్‌లు, కటౌట్లు వెలిశాయి. అన్నింటిలోను మోదీ, చంద్రబాబు, పవన్, లోకేష్ ఫొటోలే దర్శనమిచ్చాయి. బీజేపీ వారి ఫొటోలు ఎక్కడా కనిపించలేదు. దీంతో మోదీ రోడ్ షోలో కూడా లోకేష్ ఉంటారని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా ఓపెన్ టాప్ జీప్‌లో లోకేష్‌కు చోట దక్కలేదు. ప్రధాని మోదీ రోడ్‌షో జీప్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరీలు మాత్రమే ఉన్నారు.

చంద్రబాబు స్పీచ్ మధ్యలోనే జనాలు జంప్

బహిరంగ సభ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కేవలం 5 నుంచి 10 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. అనంతరం మైక్ అందుకున్న చంద్రబాబు మాత్రం అరగంటకు పైగా మాట్లాడారు. దీంతో ఆయన స్పీచ్ మధ్యలోనే జనాలు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీంతో అరగంట తరువాత స్పీచ్‌ను వేగంగా పూర్తి చేశారు. అనంతరం ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి 20 నిమిషాలు ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల విలువైన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సభ అనంతరం ప్రధాని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో భువనేశ్వర్‌కు పయనమయ్యారు.

30 వేల మంది రాక

ప్రధాని సభకు భారీగా జనాలను తరలించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సభా ప్రాంగణంలో మూడు టెంట్లు ఏర్పాటు చేసి ఒక్కో దానిలో 7 వేల సీట్లను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర నుంచి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో జనాలను తరలించారు. రోడ్ షో, బహిరంగ సభకు లక్ష నుంచి రెండు లక్షల మంది జనాలు వచ్చినట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించినా.. వాస్తవ సీటింగ్ సామర్థ్యం ప్రకారం 30 వేల మంది మాత్రమే సభకు హాజరైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

భారీ భద్రతా ఏర్పాట్లు

ప్రధాని సభకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు కల్పించారు. ఒకవైపు వీఐపీలకు భద్రతా చర్యలు చేపడుతూనే.. మరోవైపు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. దీంతో ప్రశాంతంగా ప్రధాని సభ ముగిసింది.

తీర ప్రాంత గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తత

- చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకంపై ఆగ్రహం
- బల్క్ డ్రగ్ పార్క్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోవడంపై నిరసన
- పెద్దఎత్తున మత్స్యకారులు, మహిళల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు
- రాజయ్యపేటలో ఇరువర్గాల మధ్య తోపులాట



రాజయ్యపేటలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, మహిళలు



రాజయ్యపేటలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట

నక్కపల్లి: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో బుధవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా బల్క్ డ్రగ్ పార్క్‌కు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో శంకస్థాపన చేయించడాన్ని నిరసిస్తూ మత్స్యకారులు, మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం భూములు సేకరించిన రాజయ్యపేట, చందనాడ, బోయపాడు తదితర గ్రామాల్లో మత్స్యకారులు, మహిళలు రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. నిర్వాసితులకు, బాధిత రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ పాకేజీ అందజేయకుండా, పునరావాసం కల్పించకుండా బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకస్థాపన చేయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తోంది. దీనికి విశాఖపట్నం నుంచి ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాజయ్యపేటలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ బహిరంగ సభకు వెళ్లి తమ గోడు చెప్పుకునేందుకు ప్రయత్నించిన మత్స్యకారులు, రైతులు, మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు మద్దతు ఇచ్చేందుకు రాజయ్యపేట వచ్చిన సీపీఎం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, అప్పలరాజు, సత్యనారాయణ, రాజేష్‌లతో పాటు మత్స్యకార నాయకులు సోమేష్, బయన్న తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించాలని సీఐలు కుమార స్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, పోలీసు సిబ్బంది ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన మహిళలు పోలీసు వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. మహిళలు పోలీసులపై పెద్ద ఎత్తున విరుచుకు పడ్డారు. మాగోడు చెప్పుకునేందుకు కూడా వెళ్లనివ్వరా అంటూ వాగ్వాదానికి దిగారు. 2014లో భూసేకరణ సమయంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, కేవలం నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లు తమ భూముల జోలికి రాలేదని, తాజాగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత భూములు స్వాధీనం చేసుకుని జీడి, మామిడి, కొబ్బరి తోటలను తొలగించి కంపెనీ ఏర్పాటు పనులు ప్రారంభించారన్నారు. గతంలో తమకు ఇచ్చిన హామీల విషయమై రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెళ్లి ప్రశ్నిద్దామని నిర్ణయించుకున్నామని, పోలీసులు తమను అడ్డుకుని, తమకు సంఘీభావం తెలిపిన వారిని అరెస్టు చేసి దూరప్రాంతాల్లో ఉన్న స్టేషన్లకు తరలించారని, కొంత మందిని హౌస్ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పార్క్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం 5 గంటలకు జరిగే బహిరంగ సభ వద్దకు ఆందోళనకారులు రాకుండా వందలాది మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

- 18 మందికి వాంతులు, విరేచనాలు
- వీరిలో ఒక విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరం

నర్సీపట్నం: మండలంలోని వేములపూడి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలోని ఆహారం కలుషితం కావడంతోనే అస్వస్థతకు గురైనట్టు తెలుస్తోంది. మంగళవారం ఉదయం పులిహోర, రాత్రి అరటి కాయ కూరతో భోజనం చేశారు. భోజనం చేసిన గంట తరువాత నుంచి వాంతులు, విరేచనాలు అయ్యాయి. కడుపు నొప్పితో ఆ రాత్రి అంతా విద్యార్థినులు బాధపడ్డారు. మొత్తం 18 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, వీరిలో ఆరో తరగతి విద్యార్థిని పిండి తనోజ్, ఎనిమిదో తరగతి విద్యార్థినులు కె.హేమలత, ఎస్.నవ్యశ్రీ , హేమ అమృత హర్షిణి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని వి.కాక్షాయిని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో సమీపంలోని వేములపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి అనూష సత్వరం వైద్య సేవలు అందించారు. అయినప్పటికీ తనోజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు నర్సీపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. మిగిలిన నలుగురు విద్యార్థినులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ అనుషా, వైద్య సిబ్బందితో హుటాహుటిన కస్తూర్బా పాఠశాలకు చేరుకుని, పాఠశాల సూపరింటెండెంట్ శాంతి పర్యవేక్షణలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పితో బాధపడుతున్న ఎస్.హేమలత, డి.లాస్య, వై.దాక్షాయిని, కె.వసంత దుర్గ, ఎ.లోషిని, జి.రోషిని, జి.కుసుమ దుర్గ, డి.సాయి సంధ్యన, ఎ.యశ్వస్విని లక్ష్మి, ఎస్.యశోద, ఎం.కృష్ణకుమారి, వై.లావణ్య, హేమజోషినికి వైద్య సేవలు అందించడంతో వారు తేరుకున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారి తెలిపారు. పాఠశాలలో మొత్తం 250 మంది పిల్లలు చదువుతున్నారు. తిన్న ఆహారం అరగకపోవడం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని డాక్టర్ తెలిపారు.



చికిత్స పొందుతున్న తనోజ్



విద్యార్థినుల వివరాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

కొండెంపూడి కేవీకేకి పురస్కారం వెల్లువెత్తిన అభినందనలు



కమిషనర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞన కేంద్రానికి రాష్ట్ర స్థాయిలోఉత్తమ కేవీకే పురస్కారం లభించడంపై అభినందనలు వెల్లువెత్తాయి. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి చేతుల మీదగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజ్‌కుమార్, ఎన్.సత్తిబాబు, ఎ.సౌజన్య, ఎన్.కిషోర్, పి.బాబులు అవార్డు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కొండెంపూడిలో కేవీకే ఏర్పాటు చేసిన ఆరు సంవత్సరాల్లో రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఉత్తమ దిగుబడులు సాధించడం, నూతన వంగడాలను తయారు చేసి అందించడంలో కేవీకే శాస్త్రవేత్తలు విశేష కృషి చేశారు. ఈ ఏడాది మూడు లక్షలకు పైగా నాణ్యమైన నారు మొక్కలు తయారు చేసి రైతులకు అందించారు. కేవీకేకి అవార్డు లభించడంతో అభినందనలు వెల్లువెత్తాయి. అధికారులు, పలువురు రైతు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

శివనారాయణరాజు ఎన్నికపై హర్షం



నర్సీపట్నం: ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సీపట్నానికి చెందిన కె.శివనారాయణరాజు ఎన్నికయ్యారు. ఈనెల 7న విజయవాడ రైల్వే న్యూ క్వార్టర్స్‌లో జరిగిన ఎన్నికల్లో శివనారాయణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.వి.ఎస్.ఎన్.రాజు ప్రకటించారు. ఈయన ఎన్నిక పట్ల పట్టణానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విధి నిర్వహణలో కాంట్రాక్ట్ లెక్చరర్ మృతి



గుంపాన బాబూరావు (ఫైల్)

పాతపట్నం(శ్రీకాకుళం జిల్లా): పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో హిస్టరీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గుంపాన బాబూరావు (58) విధి నిర్వహణలో ఉండగా మృతిచెందారు.. బుధవారం ఉదయం 9.30 గంటలకు డిగ్రీ కళాశాలకు చేరుకున్న ఆయన 11.45 గంటల సమయంలో ఛాతీనొప్పి వస్తోందని చెప్పడంతో తోటి అధ్యాపకులు వెంటనే పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బాబూరావు ఐదేళ్లుగా పాతపట్నం దేవాంగుల వీధిలో నివాసముంటూ కళాశాలకు వెళ్లి వస్తున్నారు. ఈయన స్వగ్రామం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం శిరిజాం గ్రామం. భార్య గుంపాన రవణమ్మ, ఇద్దరు కుమారులు సింహాద్రి మృత్యుంజయ, మహాదేవులనాయుడు ఉన్నారు. బాబూరావు మృతి పట్ల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, అధ్యాపకులు సంతాపం తెలిపారు.

ప్రశ్నిస్తారనే అణచివేత

- పోలీసుల నిర్బంధంలో వైఎస్సార్‌సీపీ నాయకులు
- నిరసనగా ఆందోళనలు



వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం, తదితరులను నక్కపల్లి స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు



పాటిమీద గ్రామంలో ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న మహిళలు



వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్టుకు నిరసనగా రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

నక్కపల్లి: మండలంలో పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌కి భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులు, చేతి వృత్తుల వారు పరిహారం చెల్లింపుల్లో తమకు అన్యాయం జరిగిందని రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధపడ్డారు. వారికి వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. రైతుల సమస్యలు పరిష్కరించాకే పార్క్‌కు శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. బాధితులంతా రాజయ్యపేటలో జరిగే బహిరంగ సభకు నాయకులతో కలిసి వచ్చి ఆందోళన చేస్తారనే ఉద్దేశంతో పోలీసుల బుధవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, చందనాడ సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్, సీఐటీయూ నాయకుడు సత్యనారాయణ తదితరులను నక్కపల్లి పోలీసులు అరెస్టు చేసి మధ్యాహ్నం వరకు స్థానిక స్టేషన్‌లో ఉంచారు. నాయకులను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న చందనాడ, తమ్మయ్యపేట, పాటిమీద, తుమ్మలపేట గ్రామాలకు చెందిన మహిళలు, గ్రామస్తులు ఆయా గ్రామాల్లో రోడ్లమీదకు వచ్చి ఆందోళనకు దిగారు. బాధిత రైతులకు మద్దతు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ , సీపీఎం నాయకులను అరెస్టు చేయడం తగదంటూ కళ్లకు నల్ల వస్త్రాలు కట్టుకుని బైఠాయించారు. నాయకులకు సంఘీభావంగా వందలాది మంది మహిళలు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు రావడానికి ప్రయత్నించగా నక్కపల్లి స్టేషన్‌లో ఉంచిన నాయకులను పాయకరావుపేట, ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వీసం తదితరులు మాట్లాడుతూ అరెస్టుల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరన్నారు. చంద్రబాబు సర్కారు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా భూములు స్వాధీనం చేసుకుని ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మను పోలీసులు రాజయ్యపేటలో హౌస్ అరెస్టు చేశారు. నాయకుల అక్రమ అరెస్టు, సమస్యలు పరిష్కరించకుండా డ్రగ్ పార్క్ శంకుస్థాపనను నిరసిస్తూ పాటిమీద గ్రామంలో మహిళలు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. పనులు జరగనిచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు. మా పొట్టలు కొట్టొద్దని, చంద్రబాబును నమ్మి భూములు ఇచ్చామని మమ్మల్ని మోసం చేస్తున్నారంటూ వాపోయారు.

రాజయ్యపేట సభ వెలవెల



రాజయ్యపేట సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు



పూడిమడక సభకు హాజరైన జనం



మోదీ సభకు నలుగురితో వెళ్తున్న బస్సు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో రూ.1,877 కోట్ల వ్యయంతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్‌పార్క్‌కు ప్రధాని నరేంద్రమోదీ బుధవారం విశాఖలో శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాన్ని మండల ప్రజలు తిలకించేందుకు రాజయ్యపేట వద్ద భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. వర్చువల్‌విధానంలో మోదీ సందేశాన్ని వినిపించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జాయింట్‌కలెక్టర్ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మండల నలుమూలలనుంచి రెండు వేలమందిని బస్సుల్లో తరలించి విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం, టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నాలుగు రోజుల ముందునుంచే భారీవేదిక, పెద్ద టీవీ స్క్రీన్‌లు,కుర్చీలు ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన మేర ప్రజలు రాలేదు. డ్వాక్రామహిళలను ఈ కార్యక్రమానికి రప్పించారు. మధ్యాహ్నం మూడు గంటలనుంచి సభావేదిక వద్ద నక్కపల్లి, బోదిగల్లం పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో కోలాటాలు, డ్యాన్సులు ప్రదర్శించారు. వచ్చిన కొద్దిపాటి జనం మంత్రి లోకేష్ ప్రసంగం ప్రారంభం కాగానే వెళ్లిపోయారు. మోదీ ప్రసంగం సమయానికి మూడు వంతుల కుపైగా సభా ప్రాంగణం ఖాళీ అయింది. అధికారులు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది మాత్రమే మిగిలారు. టీడీపీ నాయకులకు కూడా పెద్దగా హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెటి వెంకటేష్, సీనియర్ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీను, సుధాకర్,ఏపీఐఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిరాశే...

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లో ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌కు విశాఖ నుంచి ప్రధాన మోదీ బుధవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన దృశ్యాలను ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ కోసం కేటాయించిన స్థలం వద్ద ఏర్పాటు చేసిన టీవీల ద్వారా పలువురు వీక్షించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సభలో ప్రధాని, సీఎం తదితరుల నుంచి హామీ లభిస్తుందనుకున్న మత్స్యకారులకు నిరాశ ఎదురైంది. ఉత్తరాంధ్ర జనసేన రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుందరపు విజయ్‌కుమార్,కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పలువురు నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

మోదీ సభకు నలుగురితో వెళ్లిన బస్సు

అనకాపల్లి: విశాఖలో బుధవారం జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభకు కూటమి నేతలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉచితంగా బస్సులు వేసి ప్రజలను తరలించారు. అయితే బుధవారం అనకాపల్లి నుంచి తరలివెళ్లిన ఓ బస్సులో నలుగురు మాత్రమే ఉండడం కనిపించింది. ప్రచార ఆర్భాటం కోసం ప్రజాధనం దుర్వినియోగం చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని సభకు వచ్చిన ముగ్గురికి అస్వస్థత

మహారాణిపేట: ప్రధానమంత్రి రోడ్డు షో, బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. రావాడ రామారావుకు ఫిట్స్ రాగా, రత్నం కడుపునొప్పికి గురయ్యారు. లక్ష్మి కాలికి దెబ్బతగిలింది. వీరికి డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, డాక్టర్ భరత్, 108 వాహనం జిల్లా కో–ఆర్డినేటర్ వి.త్రినాథరావు, సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ ప్రథమ చికిత్స అందించి.. కేజీహెచ్‌కు తరలించారు.

అక్రమ అరెస్టులు.. గృహ నిర్బంధాలు

- కూటమి ప్రభుత్వం పిరికిపంద చర్య
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకుల ధ్వజం
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు



దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు డి.వెంకన్న, బి.టి.దొర



స్పృహ తప్పి పడిపోయిన వెలుగు సీసీకి పీహెచ్‌సీలో చికిత్స చేస్తున్న వైద్యులు



గృహ నిర్బంధంలో వైఎస్‌ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చోడపల్లి అప్పారావు



గొండుపాలెంలో సీపీఎం నాయకుడు దేముడును నిర్బంధించిన పోలీసులు

దేవరాపల్లి: విశాఖలో ప్రధాని మోదీ పర్యటిస్తే అనకాపల్లి జిల్లాలో సీపీఎం నాయకులను గృహ నిర్బంధం, అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర విమర్శించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ దేవరాపల్లిలో బుధవారం ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వ పిరికిపంద చర్య అని, అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు హాని కల్గించే హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వరాదని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్కును ఆపాలని కొద్ది రోజులుగా ఉద్యమాలు చేస్తుంటే పరిష్కరించాల్సిన కూటమి ప్రభుత్వం ఉద్యమకారులను నిర్బంధించడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ప్రజా ఉద్యమకారులను అరెస్టు చేయడమంటే ప్రజలను అరెస్టు చేసినట్లేనని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించని ప్రభుత్వానికి పుట్టగతులుండవని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుందని ఈ చర్యలతో అర్థమవుతుందన్నారు. విశాఖ ఉక్కును బలి చేసి నక్కపల్లిలో మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీ కట్టడాన్ని అంతా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేత వీసంకు సంఘీభావం

పాయకరావుపేట: నక్కపల్లిలో బుధవారం తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులను నక్కపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ సర్పంచ్ సూరకాసుల గోవిందు, ఎంపీటీసీలు తల్లా భార్గవ్, గంటా తిరుపతిరావులను నక్కపల్లిలో అరెస్ట్ చేసి పాయకరావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారికి పాయకరావుపేట నాయకులు సంఘీభావం తెలిపారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మాసాహెబుపేట సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు జగతా శ్రీను, కోనేటి పద్మారావు, దేవవరపు రమణారావు, తదితరులు సంఘీభావం తెలిపారు.

జన సమీకరణకు తీవ్ర ఒత్తిడి

అచ్యుతాపురం: పూడిమడక సమీపంలో ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమం తిలకించేందుకు ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి భారీగా జన సమీకరణ చేయాల్సి రావడంతో అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో వెలుగు సీసీ ఒకరు స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ఆయనను స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలందించారు. హైబీపీ వల్లే సీసీ పడిపోయారని వైద్యులు తెలిపారు.

వైఎస్‌ఆర్‌టీయూసీ నేత గృహ నిర్బంధం

ప్రధాన పర్యటన నేపథ్యంలో వైఎస్‌ఆర్‌టీయూసీ అధ్యక్షుడు చోడపల్లి అప్పారావును గృహ నిర్బంధం చేశారు. పలువురు వామపక్ష నాయకులను కూడా నిర్బంధించారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధం

కె.కోటపాడు: విశాఖలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఎటువంటి నిరసనలు తెలపకుండా ముందస్తుగా సీపీఎం నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గొండుపాలెంలో సీపీఎం నాయకుడు యర్రా దేముడు, ఆనందపురంలో పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడును ఇళ్ల వద్దనే నిర్బంధించారు. ప్రజా సమస్యలను దేశ ప్రధానికి తెలియకుండా ఇలా గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ముత్యాలనాయుడు మండిపడ్డారు.

కమీషన్లకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

- బెల్ట్‌షాపుల ద్వారా గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ధ్వజం



మాట్లాడుతున్న చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తే కూటమి ప్రభుత్వం మాత్రం కమీషన్లకు ప్రాధాన్యత ఇస్తోందని చోడవరం వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎద్దేవ చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిండుగొండ మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకటరాజారావును పరామర్శించడానికి బుధవారం వచ్చిన ధర్మశ్రీ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ హయాంలో మంజూరైన ప్రాజెక్టులకే బుధవారం ప్రధానమంత్రి మోదీతో షో చేసి సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ హయాంలోనే రైల్వేజోన్ మంజూరుకు కృషి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రోలుగుంట మండలంలో ఆథరైజ్డ్, అనాథరైజ్డ్ క్వారీల నుంచి రోజుకు వందలాది లారీలతో మండలం నుంచి 8 ఎంఎం, 10ఎంఎం పిక్క, నల్లరాయి పరిమితికి మించి రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యూనిట్ పిక్క రూ.2,400 అయితే లోడుకు అదనంగా రూ.250 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ అదనపు డబ్బులు కూటమి నాయకుల జేబుల్లోకి వెళ్తుందని అనుమానిస్తున్నామని చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో బెల్టుషాపుల ద్వారా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఎటి గైరంపేట, రావికమతం, బుచ్చియ్యపేట మండలాల్లో రూ.78 లక్షలు వెచ్చించి పలు రోడ్ల నిర్మాణం చేపట్టానన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే తమ ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులు కూడా ఎన్నో చేశామన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడు మాసాలైనా రాష్ట్రంలో అభివృద్ధి ఛాయలు కనిపించలేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పాత్ర పోషిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శెట్టి సంధ్య, ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీ శ్రీనివాస్, టి.వి.రమణ, పోతల రాజశేఖర్, దోసపత్ని రాజు, దారపురెడ్డి నారాయణమూర్తి, మద్దు తాతబాబు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన



రోలుగుంట పీఏసీఎస్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రోలుగుంట : రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు స్థానిక పీఏసీఎస్ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు .ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మద్దు మహేష్ మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగులకు 36 జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27 వరకూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాల్లో చేపడతామని, వచ్చే నెల 10న నిరవధిక సమ్మెలోకి దిగుతామని ఆయన తెలిపారు.

కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి బదిలీ

- పలు ఆరోపణలపై జిల్లా రిజిస్ట్రార్ విచారణ
- నివేదిక మేరకు చర్యలు



సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు : పలు ఆరోపణల కారణంగా కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖపట్నంలో చిట్స్ సహాయ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శకుంతలను నియమించారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా పాలకొండ నుంచి కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఎక్కువగా ఇతర ప్రాంతాల్లోని ఆస్తులను ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆసక్తిని చూపుతుండేవారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కె.కోటపాడు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని గ్రామాల్లోని క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లపై పెద్దగా ఆసక్తి చూపేవారు కాదని విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో పెందుర్తి మండలం నరవలోని నోషనల్ ఖాతాలో ఉన్న భూమిని సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి రిజిస్ట్రేషన్ చేశారన్న అభియోగాలతో పాటు తుంగ్లాంకు చెందిన ఒక కుటుంబంలో జరిగిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా రద్దు చేయడంపై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు అందినట్టు తెలిసింది. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు కార్యాలయంలో విచారణ చేపట్టి, ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఎనీవేర్‌తో పాటు నిబంధనలు పాటించకుడా జరిగిన రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో కార్యాలయంలో మరో అధికారి పాత్ర ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

1000 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



తురకలపూడిలో బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట: నాటు సారా తయారు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ కె.వి. బాపునాయుడు అన్నారు. బుధవారం తురకలపూడిలో 400 లీటర్ల బెల్లం పులుపు, గొర్లివానిపాలెంలో 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనకాపల్లి టాస్క్‌ఫోర్సు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో గంజాయి రవాణా

- ట్రాక్టర్ తొట్టె కింద రహస్య అరల్లో తరలింపు
- ఆటకట్టించిన చోడవరం పోలీసులు
- 250 కిలోల గంజాయి స్వాధీనం
- అదుపులో ఇద్దరు నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

చోడవరం: ట్రాక్టర్ తొట్టె అడుగుభాగంలో రహస్య అరలు..వాటిలో ప్యాకెట్లలో గంజాయి... ఎవరికీ అనుమానం రాకుండా పైన ఖాళీగా తొట్టె ... ఇలా స్మగ్లరు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చోడవరం పోలీసులు వారి ఎత్తుగడలను చిత్తు చేశారు. 250 కిలోల గంజాయిని బుధవారం పట్టుకున్నారు. ప్యాకెట్లలో తరలిస్తున్న గంజాయి విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని అంచనా. చోడవరం శివారు ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పెదబయలు నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న ట్రాక్టర్ అనుమానాస్పదంగా ఉండడంతో దానిని క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాక్టర్ కింద భాగంలో ఏర్పాటు చేసిన అరల్లో ఐదు కిలోల చొప్పున ప్యాక్ చేసి ఉన్న 50 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ట్రాక్టర్, గంజాయిని స్వాధీనం చేసుకుని, పెదబయలుకు చెందిన నిందితులు చిన్నారావు, త్రిమూర్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పూర్తి వివరాల కోసం చోడవరం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే సినీ ఫక్కీలో ప్రత్యేకంగా తయారు చేసిన ట్రాక్టర్‌పై గంజాయి రవాణా చేయడం వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారు, బడాబాబులు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

'రాజకీయ' కూల్చివేతలు



తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న బాధితులు

- వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్
- గతంలో కన్నబాబు షాపు కూల్చివేత
- తాజాగా హైకోర్టు ఆదేశాలతో అయ్యరిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ భవనం సర్వే
- ఆక్రమణకు పాల్పడలేదని శ్రీనివాసరావు స్పష్టీకరణ

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీలో చురుకైన పాత్ర పోషించిన నాయకులను టీడీపీ నాయకులు టార్గెట్ చేశారు. స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నర్సీపట్నం మున్సిపాలిటీలో రాజకీయ కక్షలతో కూల్చివేతల పరంపర కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం మున్సిపాలిటీ గచ్చపువీధిలో గల వైఎస్సార్‌సీపీ నాయకుడు చిటికెల కన్నబాబు షాపును అధికారులు కూల్చివేశారు. అదే సమయంలో పంట కాలువను ఆక్రమించి నిర్మించిన భవనాన్ని తొలగిస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు, అయ్యరిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి సత్యనారాయణ మూర్తి(శ్రీనివాసరావు)కి అధికారులు నోటీసు ఇచ్చారు. శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉండడంతో రెవెన్యూ అధికారులు వెనకకు తగ్గారు. సర్వే నంబరు 115లో ఉన్న భవనంపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని హైకోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. బుధవారం తహసీల్దార్ రామారావు, డివిజనల్ సర్వేయర్, సిబ్బంది బిల్డింగ్‌ను సర్వే చేశారు. అప్పట్లో బైపాస్ రోడ్డు నిర్మాణానికి జిరాయితీ భూమి ఇచ్చామని, మాకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని బాధితులు శ్రీనువాసరావు, శెట్టి సత్యవతి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. తాము ఆక్రమణకు పాల్పడలేదని, భవనానికి కొన్నేళ్లుగా మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నామని, ప్లాన్ అప్రూవల్ ఉందని వారు తెలిపారు. బిల్డింగ్ కూల్చడానికి రాలేదని కోర్టు ఆదేశాల మేరకు సమగ్ర సర్వే చేసేందుకు వచ్చామని తహసీల్దార్ బాధితులకు సూచించారు. తదుపరి కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ కాలువ భూమిని అక్రమించి నిర్మించినందున బిల్డింగ్ తొలగిస్తున్నామని శ్రీనివాసరావుకు నోటీసు ఇచ్చామన్నారు. ఆయన కోర్టును ఆశ్రయించడంతో సర్వే సమగ్రంగా జరపాలని కోర్టు ఆదేశించిందన్నారు. 115 సర్వే నంబరులో ఉన్న భవనంపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేశాం, నివేదికను కోర్టుకు సమర్పిస్తామన్నారు. తదుపరి కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధాలు అన్యాయం



అరెస్టులకు నిరసనగా రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ బహిరంగ సభను దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా పోలీసులు సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక పెరుగుబజార్ జంక్షన్ సమీపంలో పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో చెపట్టారు. విదేశాల్లో నిషేధించిన కంపెనీలను అనకాపల్లి తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగిస్తుండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు అక్రమ అరెస్టులు ఉండవని ప్రకటించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. నక్కపల్లిలో భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేడు ఆ సమస్యను పరిష్కరించకుండా సీపీఎం నాయకులను నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.వి. శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, చలపతి, బీశెట్టి అప్పారావు, టి. సురేష్, కాపుశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధాలు దారుణం..

కశింకోట: ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా సీపీఎం నాయకులను రెండు రోజుల పాటు నిర్బంధించడం దారుణమని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడానికి, గనులు కేటాయించడానికి కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ అరెస్టులు ఉండబోవని మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో హామీలిచ్చారని, ఇప్పుడు యథావిధిగా గృహ నిర్బంధాలు చేయించడం శోచనీయమన్నారు. ఇటువంటి అక్రమ అరెస్టులను సీపీఎం ప్రతిఘటిస్తూ పోరాటాలు చేయడానికి వెనుకాడదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా సీపీఐ నాయకుడు రాజాన దొరబాబును కూడా పోలీసులు నిర్బంధించారు.

సీపీఐ సీనియర్ నాయకుడు భద్రం గృహ నిర్బంధం

అనకాపల్లి: సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం తీవ్ర అనారోగ్యంలో గత కొంత కాలంగా ఇంట్లోనే ఉంటున్నారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భద్రాన్ని బుధవారం గృహ నిర్బంధం చేశారు.

సీపీఐ సీనియర్ నాయకుడు భద్రం ఇంట్లో పోలీస్ బందోబస్తు



మోదీ సభకు తరలి వెళ్లిన నాయకులు

కశింకోట: మండలం నుంచి విశాఖలోని ప్రధాని మోదీ బహిరంగ సభకు సుమారు ఏడు వేల మందిని తరలించారు. గ్రామాల నుంచి సుమారు 140 బస్సుల్లో వీరు తరలి వెళ్లారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, కూటమి పార్టీల శ్రేణులను తరలించారు. కశింకోటలో ఈ బస్సులకు జెండా ఊపి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, కూటమి నాయకులు వేగి గోపీకృష్ణ, బుదిరెడ్డి చిన్న, దాసరి బాబు, వేగి రామకోటేశ్వరరావు, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మోదీ సభకు వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అలరించిన సంక్రాంతి సంబరాలు



ఏఎంఏఎల్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

తుమ్మపాల: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మండలంలో కొత్తూరులో గల ఏఎంఏఎల్ హై స్కూల్‌లో విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో బుధవారం సందడి చేశారు. ముగ్గులు, గాలి పటం, పిండి వంటలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణ, తమ్మన రఘుబాబు, హైస్కూల్ అధ్యక్షుడు కర్నాటకపు నారాయణరావు, కరస్పాండెంట్ కొణతాల శివకుమార్ బహుమతులు అందించి విద్యార్థులను అభినందించారు. సంస్కృతీ సాంప్రదాయాలతో ముడిపడిన సంక్రాంతి పండగ ప్రతి ఇంట ఘనంగా జరగాలన్నారు. గంగిరెడ్లు హరిదాసు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోరుబిల్లి లావణ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బలరామునిగా దర్శనమిచ్చిన వేంకటేశ్వరుడు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బలరామునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో 9వ అవతారమైన బలరాముని రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యం, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



రేపు ముక్కోటి ఏకాదశి

అనకాపల్లి: స్థానిక భీమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10న ముక్కోటి ఏకాదశి నిర్వహించనున్న సందర్భంగా భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు కూటమి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సకలా గోవిందరావు, దూలం గోపి తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో బుధవారం ఏకాదశి కరపత్రాలను ఆవిష్కరించారు. సుమారు లక్ష మంది భక్తులు ఆలయానికి విచ్చేయనున్నట్లు చెప్పారు. ఈవో టి. రాజనులోచన మాట్లాడుతూ గురువారం రాత్రి తెల్లవారితే శుక్రవారం 2.30 గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, నిత్యార్చన అనంతరం ఉత్తర ద్వార దర్శనం గుండా అయోధ్య బాలరాముడి దర్శనం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో దేవాలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, పులకండం ప్రసాద్ బాబు, జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆలయ వర్గాలు

యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లి: విజయరామరాజుపేట యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా బర్నికాన గోవింద్ ఎన్నికయ్యారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మోదమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా బొబ్బిలి అప్పారావు, కార్యదర్శిగా బొబ్బిలి రామారావు, కోశాధికారిగా బర్నికాన శ్రీనివాసరావు, వర్కింగ్ అధ్యక్షునిగా వాయబోయిన చంద్ర శేఖర్, ఉపాధ్యక్షుడిగా ముగడ అప్పారావు, సహాయ కార్యదర్శిగా కుండల రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బొబ్బిలి సాంబమూర్తి, బర్నికాన నూకరాజు, ముఖ్య సలహాదారుగా బొట్టా చిన్ని, సభ్యులుగా నంబారు నూకరాజు, పల్లా సత్య అప్పారావు, బొబ్బిలి సత్యారావు, వియ్యపు చంద్రరావు, మొల్లి నరసింగరావు, పల్లా మూర్తి, బోయిన శ్రీనివాసరావు, బొబ్బిలి అప్పలరాజు, వియ్యపు రమేష్, మురుగుతి రామచంద్రరావు, బొట్టా మోహన్, పిల్లల బాలకృష్ణ, కల్యాణ్, ఒమ్మి చిరంజీవి తదితరులు ఎన్నికయ్యారు.



కొత్తగా ఎన్నికైన సంఘం కార్యవర్గ సభ్యులు

ఘనంగా శ్రీవారి పెళ్లి రాట



పెళ్లి రాట వేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి పెళ్లి రాట ఉత్సవం వైభవంగా జరిగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10న స్వామి వారి కల్యాణోత్సవాన్ని భారీగా నిర్వహించనున్న నేపథ్యంలో సంప్రదాయబద్ధంగా ముందుగా పెళ్లి రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చింతా సుబ్రహ్మణం ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ నేరేడు కొమ్మను తెచ్చి దానికి పసుపు, కుంకుమ రాసి బొట్లు పెట్టారు. శాస్త్రోక్తంగా పూజలు చేశారు. దాన్ని పెళ్లి రాటగా నిలిపి పూజలు చేశారు. మహిళా భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

విద్యార్థినులకు ఎస్‌బీఐ ద్వారా సైకిళ్ల వితరణ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న బ్యాంకు ఆర్‌ఎం జగదీశ్వరరావు, చీఫ్ మేనేజర్ పృథ్వి

నాతవరం : భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా ప్రతి ఏటా సీఎస్ఆర్ నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు కె.జగదీశ్వరరావు అన్నారు. డి.యర్రవరం హైస్కూల్‌లో బుధవారం పది మంది పేద విద్యార్థులకు సైకిల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా సీఎస్ఆర్ నిధులతో జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రాంతాల వారీగా అక్కడ పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో హైస్కూల్లో పేద బాలికలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో స్థానిక పెద్దలతో చర్చించి ఉచితంగా సైకిల్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ ఎ.పృథ్వి, వై.డి.పేట స్టేట్ బ్యాంకు బ్రాంచి మేనేజరు ఎం.శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఆకుల కుమారి, ఉపాధ్యాయులు లాలం గణేష్ పాల్గొన్నారు.

సభ్య రైతులందరికీ సంక్రాంతి బోనస్ అందించాలి

మాడుగుల రూరల్ : విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న ప్రతి సభ్య రైతుకు సంక్రాంతి బోనస్ అందించాలని సభ్య రైతులు కోరుతున్నారు. ఇటీవల మూడు మాసాల క్రితం గేదె, ఆవు పాల ధరలు లీటరుకు రెండు రుపాయల చొప్పున తగ్గించారు. అయినా సరే విశాఖ డెయిరీని నమ్ముకుని పాడి రైతులు పాలు సరఫరా చేస్తున్నారు. 2023 మార్చి నెల నుంచి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు పాలు సరఫరా చేసిన పాడి రైతులకు సరాసరిగా సంక్రాంతి బోనస్‌ను అందిస్తున్నారు. విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తూ మధ్యలో ప్రైవేటు డెయిరీలకు పాలు సరఫరా చేసే రైతులకు బోనస్ నిలుపుదల చేయాలని, విశాఖ డెయిరీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఎస్ఎన్ఎఫ్ తగ్గడం వల్ల కొందరు పాడి రైతులు ప్రైవేటు పాలసొసైటీలకు పాలు సరఫరా చేస్తున్న నేపథ్యంలో వారికి బోనస్ నిలుపుదల చేయడం తగదని సభ్య రైతులు రాజు బాబు, మద్దాల వెంకట సత్యనారాయణ, శంకర్రావు, కొండలరావు డెయిరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

పెదమదీనలో ఘనంగా మేలుకొలుపులు



పెదమదీనలో మేలుకొలుపు పూజలో పాల్గొన్న గ్రామస్తులు



అర్జునగిరిలో మేలుకొలుపులు

బుచ్చెయ్యపేట : పెదమదీన గ్రామంలో భోగి రోజున జరిగే భారీ అన్న సమారాధనకు మేలుకొలుపు భక్తులు తగిన ఏర్పాట్లు చేశారు. గత నెల 16వ తేదీ నెల గంట పెట్టినపుడు నుంచి ప్రతి రోజూ గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన భోగి రోజున మేలుకొలుపు బృంద సభ్యులంతా కలిసి రామాలయం వద్ద భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశారు. అలాగే భోగి రోజున జరిగే అన్న సమారాధనకు అవసరమైన కట్టెలను ఏరి ట్రాక్టర్‌పై రామాలయానికి తరలించారు.

చీడికాడ : ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని, అర్జునగిరి గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక స్వయం భూ శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్వామి వారి భక్తి గీతాలను ఆలపిస్తూ తెల్లవారుజామున గ్రామ పుర వీధుల్లో తిరిగారు. ఈ నెల 13 వ తేదీ భోగి పండగ వరకు ఈ మేలుకొలుపు జరుగుతుందని భక్తులు పేర్కొన్నారు.

కె.కోటపాడు : ధనుర్మాసంలో ప్రతి రోజూ వేకువ జామున నిర్వహించే పూజల్లో పాల్గొనే భక్తులకు చౌడువాడలో గల సీతారామాంజనేయ ఆలయ అర్చకుడు దార్లపూడి సాయిరాం బుధవారం బహుమతులను అందించారు. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రోజూ గ్రామంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న 110 మంది భక్తులకు ఆలయ అర్చకుడు సాయిరాం తన సొంత నగదు రూ.10వేలతో బహుమతులను కొనుగోలు చేసి అందించారు. మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు భక్తిభావంతో పాటు ఆరోగ్యం కలగనున్నట్టు సాయిరాం తెలిపారు. కార్యక్రమంలో సీతారామాంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అనుకూలం.. అనకాపల్లి పట్టణం

- ప్రశాంతతకు మారుపేరు
- షాపింగ్‌మాల్స్, బంగారం దుకాణాలు, విద్య, వైద్యాలయాలతో అందుబాటులోనే నదుపాయాలు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన సంస్కరణల వల్ల అనకాపల్లి పట్టణం అభివృద్ధి బాటలో ప్రయాణిస్తోంది. బ్రిటీష్ కాలం నాటి నుంచి అనకాపల్లి పట్టణానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ అనకాపల్లి వచ్చి ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. జాతీయ స్థాయిలో రెండో స్థానంలో అనకాపల్లి బెల్లం మార్కెట్ పేరుగాంచింది. దక్షిణ మధ్య రైల్వే స్టేషన్‌లో అనకాపల్లి చిట్టచివరి రైల్వే స్టేషన్. ప్రయాణికులు, ఇతర వనరుల ద్వారా రైల్వేకు ఆదాయం వస్తోంది. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు ప్రతి ఏడాది సంక్రాంతికి కుటుంబ సమేతంగా రాకపోకలు సాగించడంతో రైల్వే స్టేషన్ కళకళలాడుతుంది.

పెద్దపెద్ద షాపింగ్ మాల్స్... : జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పెద్దపెద్ద వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు నిత్యం లక్షలాది మంది పట్టణానికి వచ్చి కొనుగోలు చేస్తారు. ప్రతి పండక్కి దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసి పోతాయి. గతంలో విశాఖకు వెళ్లేవారు జిల్లాలోనే భారీ దుకాణలు రావడంతో ఇక్కడ కావలసినవి కొనుగోలు చేస్తున్నారు.

భారీ ఉత్సవాలు... : పట్టణ పరిధిలో కుంచావారి, వేల్పులవీధి, గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ప్రతి ఏడాది ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవం నెల రోజుల పాటు జరుగుతుంది.



అనకాపల్లి పట్టణం



పట్టణంలో బెల్లం మార్కెట్

విద్య, వైద్యం... : విద్య, వైద్యానికి పట్టణ పరిధిలో కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. రోగులకు సకాలంలో వైద్యసేవలు పట్టణంలో అందుతున్నాయి. వివిధ రకాలైన వ్యాధులకు సంబంధించిన వైద్యులు రాత్రీ పగలు అందుబాటులో ఉంటారు.

రియల్ ఎస్టేట్ రంగం... : జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం గణనీయంగా పెనిగింది. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పట్టణంలో నివసిస్తున్నారు. కొప్పాక, కొత్తూరు, సిరసపల్లి, శంకరం, రేబాక, కోడూరు, బవులవాడ, పిసినికాడ, తుమ్మపాల, మారేడు పూడిలో భూముల్లో బాగా వ్యాపారాలు జరుగుతున్నాయి. చక్కటి సౌకర్యాల వల్ల ఇక్కడ ఉన్నతాదాయ వర్గాల వారు నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రశాంత వాతావరణం.. : జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు వ్యక్తిగత పనుల నిమిత్తం నిత్యం అనకాపల్లి వస్తారు. అనకాపల్లి మండలంలో శంకరం గ్రామంలో బొజ్జన్నకొండ, సత్యనారాయణపురంలో సత్యనారాయణ స్వామి దేవాలయాలు ఉండడంతో నిత్యం పర్యాటకులతో కళకళలాడుతుంది. ప్రశాంతమైన వాతావరణం ఉండడం వల్ల ఇక్కడ నివసించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. అందుకే పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది.

పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం



పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్ ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసా...

– ఉ.లక్ష్మీ తేజ, సత్వా నేచురల్స్, సీతమ్మధార

అధునాతన దంత వైద్యం విజ్జు సొంతం

డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌తో ఉచితంగా అత్యాధునిక సేవలు



యలమంచిలి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నెలకొల్పిన విజ్జు డెంటల్ హాస్పిటల్‌లో అత్యాధునిక దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు దంత వైద్యం కోసం యలమంచిలి నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, ఇతర ప్రముఖ నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితుల్లో దంత వైద్యుడు పి. సింహాద్రినాయుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు దంతవైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న ఆశయంతో 20 ఏళ్ల క్రితం యలమంచిలి ప్రధాన రహదారి పక్కన ఎస్‌బీఐ సమీపంలో ఓ అద్దె భవనంలో దంత వైద్యశాల ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే వారికి అప్పట్నుంచి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పట్టణం, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సింహాద్రినాయుడు హస్తవాసిపై నమ్మకం ఏర్పడింది. క్రమంగా దంత వైద్యం కోసం తన వద్దకు వచ్చే రోగుల సంఖ్య బాగా పెరగడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సొంత భవనాన్ని నిర్మించారు. రూట్ కెనాల్, చిగుళ్ల వ్యాధుల చికిత్స, దంతాల మార్పు, గమ్ అండ్ టీత్ వంటి చికిత్సలన్నీ అందజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే నగదు రహిత దంత వైద్య చికిత్సలు కూడా ఇక్కడ అందుబాటులో ఉండేలా ఆస్పత్రిలో లక్షలాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలను పొందుపరిచారు. దీంతో రోగులు ఇక్కడే దంతాలకు సంబంధించిన అన్ని సమస్యలకు చికిత్స పొందుతున్నారు.

అన్నిరకాల సేవలు అందుబాటులోకి..



నేను యలమంచిలిలో దంత వైద్యం కోసం 2003లో ఆస్పత్రి ప్రారంభించినపుడు ఎలాంటి ఆస్పత్రులు లేవు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు దంతవైద్య సమస్యల కోసం ఎంతో ఇబ్బంది పడేవారు. దీనిని గుర్తించి ఇక్కడే అధునాతన దంత వైద్య సేవలు అందుబాటులోకి తెస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందన్న భావనతో ఆస్పత్రిని దశల వారీగా నవీకరించాను. ప్రముఖ నగరాల్లో అందుతున్న దంత వైద్య సేవలన్నీ ఇక్కడ అందించగలుగుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు, నేవీ, ఆర్మీ, వర్కింగ్ జర్నలిస్టులకు కూడా నగదు రహిత వైద్య సేవలందించే స్థాయికి ఆస్పత్రిని అభివృద్ధి చేయడం వెనుక ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలే కారణం. 20 ఏళ్లుగా ఆస్పత్రిని అభివృద్ధి పథంలో నిర్వహించడం వెనుక నా భార్య సునీత అవిశ్రాంత శ్రమ, తోడ్పాటు కూడా ఉంది.

– సింహాద్రినాయుడు, దంత వైద్యుడు, విజ్జు డెంటల్ ఆస్పత్రి యజమాని

జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్



మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయామం చేయడం, ఉబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి

క్యాన్సర్ నివారణ సాధ్యమే..

– డాక్టర్ రవిశంకర్